జెండా పండగ సందడి

- ప్రత్యేక దుకాణాల ఏర్పాటు
- జోరుగా త్రివర్ణ పతాకాలు, హ్యాండ్ బ్యాండ్లు, స్టిక్కర్ల విక్రయాలు





జాతీయ జెండాలు, స్వాతంత్య్ర దినోత్సవ డెకరేషన్ సామగ్రి విక్రయ దుకాణాలు

సీతంపేట: బ్రిటీష్ సంకెళ్ల నుంచి దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిన రోజు ఆగస్టు 15. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ జరుపుకునే పండగ స్వాతంత్య్ర దినోత్సవం. ఆరోజున మువ్వన్నెల జెండాకు సెల్యూట్ చేసేందుకు ప్రతి ఒక్కరూ సన్నద్ధమవుతారు. ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య



జాతీయ జెండాలు విక్రయిస్తున్న పిల్లలు

కేంద్రాలు, కార్మిక సంఘాలు, అసోసియేషన్లు, పార్టీ కార్యాలయాలు, ఆటో స్టాండ్లు ఇలా ప్రతి చోటా మువ్వన్నెల జెండాను ఎగురవేసి సెల్యూట్ చేస్తుంటారు. జెండా పండగ కోసం చాలా మంది త్రివర్ణ పతాకాలు కొనుగోలు చేస్తుంటారు. దీంతో నగరంలో పలుచోట్ల జాతీయ జెండాల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. త్రివర్ణ పతాకాలతోపాటు స్టిక్కర్లు, బాడ్జీలు, రిస్ట్ బ్యాండ్లు, బైకులకు పెట్టే జెండాలు, డెకరేషన్ కోసం దండలు ఇలా సుమారు 21 రకాల వస్తువులను దుకాణాల్లో విక్రయిస్తున్నారు. వినియోగదారుల కొనుగోళ్లతో విక్రయ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. సీతంపేట, శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, పాలబూత్ సెంటర్ తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి జెండాలు, స్టిక్కర్లు జోరుగా విక్రయిస్తున్నారు.

జెండా పండగ.. వారికి కడుపు నిండుగా!

విశాఖ విద్య: స్వాతంత్య్ర దినోత్సవం రోజున జాతీయ జెండా అంతటా రెపరెపలాడనుంది. ఇందు కోసమని మూడు రంగుల మువ్వన్నెల జెండాను అంతా కొనుగోలు చేస్తారు. రాజస్థాన్ నుంచి విశాఖ వచ్చి స్థిరపడిన ఓ కుటుంబానికి ఆగస్టు నెలలో జెండా పండుగ వారి కడుపునింపుతోంది. క్లాత్‌తో తయారు చేసిన వివిధ సైజుల జెండాలు, జేబుకు పెట్టుకునే స్టిక్కర్లు ఇలా వివిధ రకాల జెండాలను విక్రయిస్తున్నారు. నగరంలోని మద్దిలపాలెం-ఇసుక తోట రహదారిలో ఎక్కువగా వారంతా అమ్మకాలు చేపడుతున్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారావు

దాబాగార్డెన్స్: ది వైజాగ్ పటం ఫంక్షన్ మెటీరియల్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్-2023-25 కాలానికి ఎన్నుకోబడిన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా జి. పురుషోత్తమ రావు, అధ్యక్షుడిగా సీహెచ్‌వీ సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ గిరిధర్, కార్యదర్శిగా బి. సాయి బాబు, సంయుక్త కార్యదర్శులుగా మహ్మద్ యాసిన్ బాబ్జి, డి. నగేష్, ఎస్. చిట్టిబాబు, సురేష్, కోశాధికారిగా కేఎల్ గురునాథ్ ప్రమాణ స్వీకారం చేశారు. అసోసియేషన్ మీడియా ఇన్‌చార్జిగా ఎంవీ రాజశేఖర్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సీహెచ్‌బీ సుబ్బారావు మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతోనే సంస్థ ప్రగతి సాధ్యపడతుందన్నారు. ప్రతి సభ్యుడు సంస్థ అభివృద్ధికి పూర్తి సహకారమందివ్వాలని కోరారు. ఈ సందర్భంగా నిరుపేద విద్యార్థి విద్యాభివృద్ధికి రూ. 20 వేల రూపాయల కిసాన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి టెంట్ హౌసెస్ యజమానులు, సభ్యులు పాల్గొన్నారు.

శ్లోకాలు, చిత్ర లేఖనం పోటీలకు స్పందన



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు



శ్రీనివాసుడి వేషధారణలో చిన్నారి

ఎంవీపీ కాలనీ: శ్రీవేంకటేశ్వరస్వామి శ్రావణ సంగీతోత్సవాల్లో భాగంగా ఆదివారం చిన్నారులకు వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీలకు విశేష స్పందన లభించింది. విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ సంగీతోత్సవాలు ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం భక్తిగీతాలు, భగవద్గీత శ్లోకాలు, రామాయణం, భారతం, చిత్ర లేఖనం అంశాలపై నగరంలోని వివిధ కళాశాలలు, సంగీత, నృత్య కేంద్రాల చిన్నారులకు పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. పోటీల్లో పాల్గొన్న చిన్నారులు అందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో నగరంలోని డాక్టర్ రాధిక రాణి నర్తనశాల డ్యాన్స్ అకాడమీకి చెందిన కళాకారులు సందడి చేశారు. సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలతో అలరించారు. పలు భక్తిగీతాలకు కూచిపూడి నృత్యం చేసి ఆకట్టుకున్నారు. పలువురు విద్యార్థులు శ్రీనివాసుడి వేషధారణలో అలరించారు.

క్లుప్తంగా

'సంతాన లేమికి అధునాతన చికిత్స'



మాట్లాడుతున్న డాక్టర్ రాధిక

బీచ్ రోడ్డు: సంతానం లేమి జంటలకు అధునాతన చికిత్స, అత్యుత్తమ సంరక్షణ అందిస్తున్నట్టు ఒయాసిస్ ఫెర్టిలిటీ క్లినిక్ హెడ్, స్పెషలిస్ట్ డాక్టర్ రాధిక పొట్లూరి తెలిపారు. ఆస్పత్రి ఐదో వార్షికోత్సవాన్ని నగరంలో స్థానిక హోటల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధిక మీడియాతో మాట్లాడుతూ దేశంలో ప్రముఖ సంతానోత్పత్తి కేంద్రాల్లో తమ సంస్థ అధిక విజయాలు సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

చిత్రకారుడు రమణమూర్తికి సన్మానం



చిత్రకారుడు రమణమూర్తిని సత్కరిస్తున్న వైజాగ్ ఫిలిం సొసైటీ సభ్యులు

బీచ్ రోడ్డు: నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు పొన్నాడ రమణమూర్తి గీసిన పెన్సిల్ స్కెచ్ చిత్రాల ప్రదర్శనను రామ్‌నగర్‌లోని లయన్స్ క్లబ్‌లో వైజాగ్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన నగర ప్రజలను ఆకట్టుకుంది. సుమారు 70 రకాల తెలుగు సినిమాల్లో ప్రముఖుల చిత్ర మాలికలను ప్రదర్శించారు. అనంతరం చిత్రకారుడు రమణమూర్తిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, బి.చిన్నారావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం.ఎం.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలతో పిల్లలకు ఆరోగ్యం

బీచ్ రోడ్డు: కనీసం ఆరు నెలల పాటు పిల్లలకు తల్లిపాలు పట్టాలని లోటస్ ఆస్పత్రి చిన్న పిల్లల డాక్టర్ మురళీ సంతోష్ సూచించారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా ఆదివారం నగరంలోని ఒక హోటల్‌లో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వటం వల్ల పిల్లలతో పాటు తల్లికి కూడా ఆరోగ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్లు దీప్తి, లీలా, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఓటర్ల పరిశీలన



11వ వార్డులో ఓటరు పరిశీలనలో జెడ్సీ కనకమహాలక్ష్మి, తదితరులు

ఆరిలోవ: ఓటర్ల పరిశీలన కార్యక్రమం ఆరిలోవ ప్రాంతంలో కొనసాగుతోంది. జీవీఎంసీ 10, 11, 12, 13 వార్డుల్లో రోజూ బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లు జాబితా పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా 11, 12 వార్డుల్లో ఆదివారం జరిగిన ఓటరు పరిశీలనలో బీఎల్‌వోలతో కలసి జీవీఎంసీ జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటు హక్కు ఉన్నవారు ఇంట్లో ఉన్నారా? లేదో? అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితా సరిగా పరిశీలించాలని జెడ్సీ బీఎల్‌వోలకు సూచించారు.

దాడి కేసులో దర్యాప్తు ముమ్మరం

సీతమ్మధార: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వేణుకుమార్ అనే వ్యక్తిపై జరిగిన దాడికి సంబంధించిన కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. వేణుకుమార్‌పై గుర్తు తెలియని కొందరు వ్యక్తులు విచక్షణా రహితంగా దాడి చేసిన విషయం తెలిసిందే. పోలీసులు ఆదివారం సంఘటనా స్థలంలో సీసీ కెమెరాలను పరిశీలించారు.

జాతీయ సమగ్రతపై సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీ చేస్తున్న వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ చిన్నారులు

మద్దిలపాలెం: స్వాతంత్య్రం దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ సమగ్రతను చాటేందుకు ఇంటరాక్ట్ ఆఫ్ వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పిఠాపురం కాలనీ, మద్దిలపాలెం, శివాజీపాలెంలో ఈ ర్యాలీ సాగింది. చిల్డ్రన్ క్లబ్ వ్యవస్థాపకురాలు రమాదేవి మాట్లాడుతూ చిన్నారుల్లో జాతీయ సమగ్రతను చాటిచెప్పాలనే ఉద్దేశంతో ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. అందరిలో ఐక్యత, సహోదర భావాన్ని పెంపొందించాలన్నారు. సార్వభౌమాధికారం, భిన్నత్వంలో ఏకత్వం కోసం చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వీసీసీ ప్రెసిడెంట్ ఎస్.హరిత, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



పద్మశాలి నాయకులను సత్కరిస్తున్న దృశ్యం

ఆరిలోవ: ఆంధ్రప్రదేశ్ పద్మశాలి ఎంప్లాయిస్ యూనియన్ విశాఖపట్నం జిల్లా కార్యవర్గం సమావేశం ఆదివారం జీవీఎంసీ పదో వార్డు పరిధి ఆదర్శనగర్‌లో జరిగింది. యూనియన్ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర జిల్లాల కార్యవర్గం సభ్యులతో పాటు అఖిల భారత పద్మశాలి సంఘం కార్యవర్గ సభ్యుడు ఆకుల ఎ.విశ్వేశ్వరరావును సత్కరించారు. అనంతరం పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.వి.ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ పద్మశాలి ఉద్యోగులు ఐకమత్యంతో ఉండాలన్నారు. అలాంటప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఉద్యోగులు సంక్షేమం, పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించే దిశగా సంఘం పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు మోహన్ మురళీ, సభ్యులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలకు వేళాయె

- 17 నుంచి కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణలక్ష్మి పూజలు



సిరులతల్లి కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 15 వరకు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శ్రావణలక్ష్మి ప్రత్యేక కుంకుమ పూజలు జరపనున్నారు. నెల రోజులూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, అలాగే గురు, శుక్రవారాల్లో 2 విడతలుగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. ప్రత్యేక పూజలో సంకల్పం, లక్ష్మీ సహస్రనామాలు, లక్ష్మీ హోమం, అమ్మవారి దర్శనం, వేద ఆశీర్వచనం చేపట్టనున్నారు. పూజలో పాల్గొనే భక్తులకు అవసరమైన పూజా సామగ్రిని దేవస్థానమే సమకూరుస్తుంది. విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలిచే భక్తులు (దంపతులు) రూ.400 రుసుం చెల్లించాలి. పూజ అనంతరం భక్తులకు శేషవస్త్రంగా కండువా, జాకెట్టు ముక్క, పావుకేజీ పులిహోర, పావుకేజీ చక్కెర పొంగలి, శీచక్రయంత్రం (రాగి) మహాప్రసాదంగా అందజేస్తారు.

శ్రావణమాసం..పండగ పర్వదినాలు..

శ్రావణమాసంలో వచ్చే రెండో శుక్రవారం (ఆగస్టు 25) రోజున వరలక్ష్మీవ్రతం, సెప్టెంబర్ 8వ తేదీ పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే శ్రావణమాసంలో వచ్చే ఐదు శుక్రవారాలు (ఈ నెల 18, 25, సెప్టెంబర్ 1, 8, 15) ప్రత్యేక పూజలు జరపనున్నారు.

17న ప్రారంభం..

స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శ్రావణలక్ష్మీ పూజలు ప్రారంభించనున్నారు. భక్తులు శ్రావణలక్ష్మీ ప్రత్యేక కుంకుమ పూజలో పాల్గొని అమ్మవారి కృపా కటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం తెలిపారు. స్థానికేతరులు పూజలో పాల్గొనలేనిచో వారి గోత్రనామాలతో పూజ చేసి లక్ష్మీ యంత్రం, కుంకుమ, ప్రసాదం పోస్టల్ ద్వారా ఇంటి చిరునామాకు పంపనున్నట్టు ఈవో పేర్కొన్నారు.

పూజా రుసుం ఎలా చెల్లించాలి..

పూజా రుసుం రూ.400 అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్‌లో చెల్లించాలి. మరిన్ని వివరాలకు 0891-2568645, 2566515, 2731250 నంబర్లలో సంప్రదించవచ్చు.

పోస్టాఫీసుల్లో జాతీయ పతాకాల విక్రయాలు

జగదాంబ: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని పోస్టాఫీసుల్లో జాతీయ పతాకాల విక్రయాలు జరుగుతున్నాయని విశాఖపట్నం తపాలా శాఖ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆర్. రాహుల్ ఆదివారం తెలిపారు. దేశ ప్రజల్లో జాతీయ భావం పెంపొందించేందుకు భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగ 2.0'కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తపాలా శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా ప్రజల్లో అవగాహన నిమిత్తం ఈనెల 11న ఆర్‌కే బీచ్‌లో భారీ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడేందుకు తపాలా శాఖలో జాతీయ పతాకాలు అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలు, సంస్థలు, రాజకీయ పార్టీలు, కార్పొరేట్ సంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రాహుల్ కోరారు.

'పవన్ పర్యటనకు అడుగడుగునా అడ్డంకులు'



సమావేశంలో మాట్లాడుతున్న పంచకర్ల

ఎంవీపీ కాలనీ: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వారాహి యాత్రకు అధికారులు విశాఖలో అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆ పార్టీ నాయకుడు పంచకర్ల రమేష్‌బాబు ఆరోపించారు. ఆదివారం ఉషోదయ కూడలిలోని ఉషోదయ ఫంక్షన్ హాల్‌లో పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. యాత్రలో భాగంగా ప్రభుత్వ యంత్రాంగం చేస్తున్న తప్పిదాలను పవన్ ఎత్తిచూపుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో విశాఖలో పర్యటనలకు సెక్షన్ 30ని అమలు చేస్తూ అడ్డుకుంటున్నారన్నారు. ప్రభుత్వ తప్పిదాలను సవరించుకోవాల్సింది పోయి కొంత మంది మంత్రులు పవన్‌ను దూషించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. మంత్రి అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ చేసిన వ్యాఖ్యలు ఈ కోవకే చెందుతాయన్నారు. పవన్‌కల్యాణ్‌ను వ్యక్తిగతంగా దూషించడం తప్ప మరో టాపిక్ మాట్లాడే ధైర్యం రాష్ట్ర మంత్రులకు లేదన్నారు. జనసేన నాయకులు సైతం వ్యక్తిగత దూషణలు, బూతులు తిట్టగలరనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మూర్తియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పెదగదిలిలో ఆకర్షణీయంగా బస్ షెల్టర్



పెదగదిలి కూడలి వద్ద నిర్మించిన బస్ షెల్టర్

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో పెదగదిలి కూడలి వద్ద జీవీఎంసీ ఆకర్షణీయంగా బస్ షెల్టర్‌ను నిర్మించింది. ఇక్కడ ఇంతవరకు బస్ షెల్టర్ లేక పోవడంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇబ్బందిపడేవారు. ఇప్పుడు ఆ సమస్య తీరింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లోగోతో బస్ బే పేరుతో నిర్మించిన ఈ షెల్టర్ ప్రయాణికులను ఆకట్టుకుంటోంది. గ్రానైట్ పలకలతో ఫ్లోరింగ్, బెంచీ ఏర్పాటు చేశారు. డివైడర్‌లో పచ్చదనం నాశనం కాకుండా చెట్ల మధ్యలో ఈ షెల్టరును నిర్మించారు. బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మించినప్పటి నుంచి ఇక్కడ షెల్టర్ లేకపోవడంతో ఇబ్బంది పడ్డామని, ఇప్పుడు ఆ సమస్య తీరందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అవయవ దానాన్ని ఆరోగ్యశ్రీలో చేర్చాలి



మాట్లాడుతున్న గూడూరు సీతామహాలక్ష్మి

సీతంపేట: పేదలకు ఉపయోగపడేలా అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చాలని సావిత్రిభాయి పూలే ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి కోరారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన ప్రపంచ అవయనదాన వారోత్సవాల ముగింపు సభలో ఆమె మాట్లాడారు. కేజీహెచ్ వంటి ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవయవ మార్పిడి ఆపరేషన్ల కోసం ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేయాలని, దానికి అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించాలన్నారు. అవయవదానం చేసిన వారి పిల్లలకు ప్రోత్సాహకంగా ఉచిత విద్య, కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని సూచించారు. ఉన్నత విద్యా సిలబస్‌లో అవయవదానాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని, ఈ విషయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సీవీవో ఎస్.కరుణరాజు మాట్లాడుతూ అవయవదానంతో ఎంతో మందికి పునర్జన్మనిస్తున్న వారంతా దేవుళ్లతో సమానమన్నారు. అటువంటి కార్యాన్ని పెద్ద ఎత్తున చేస్తున్న గూడూరు మహాలక్ష్మి సేవలను అభినందించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద మాట్లాడుతూ బ్రెయిన్ డెడ్ అయిన వారు అవయవ దానం చేయడం వల్ల వారి నుంచి సేకరించిన గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, ప్రేగులు, ఎముకలు, మూలుగ, కళ్లు మరణానికి చేరువైన వారికి అమర్చడం ద్వారా వారికి జీవితాన్ని ప్రసాదించవచ్చని పేర్కొన్నారు. అవయవదానానికి ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా శరీరదాతలకు అభినందన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, ఏఎంసీ ప్రొఫెసర్ వి.పద్మజ, అనకాపల్లి డీటీవో వి.ఎల్.సుభాషిణి, ట్రస్టు కార్యదర్శి ఎస్.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి అమ్మవార్లకు విశేష హారతి



హారతి సమర్పిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, మాతా రమ్యానంద భారతి

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో జరుగుతున్న అష్ట పద్మ కుండాత్మక అష్టలక్ష్మీ మహాయాగంలో భాగంగా ఆదివారం సాయంత్రం అష్టలక్ష్మీ వైభవం అత్యంత ఘనంగా నిర్వహించారు. కుర్తాళ పీఠం ఆస్థాన పండితులు మాచవోలు రమేష్‌శర్మ వేద మంత్రాలతో అష్టలక్ష్మీ అమ్మవార్లకు విశేష అర్చన, దర్బారు సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అష్టలక్ష్మీ అమ్మవార్లకు హారతి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మికి అత్యంత ప్రీతిపాత్రమైన శ్రావణ మాసం అధిక మాసంగా వచ్చిందన్నారు. అధిక మాసంలో పూజ, జప, హోమాలూ చేస్తే అధికమైన సత్ఫలితాలు వస్తాయని శ్రీమహావిష్ణువు అధిక మాస ప్రాశస్త్యంలో చెప్పారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని పాల్గొన్నారు. పీఠం మేనేజర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చలన చిత్రాల నిర్మాణానికి ప్రభుత్వ సహకారం

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఏపీ జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్, డ్యాన్స్ డైరెక్టర్స్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. ముఖ్య అతిథి ఎస్‌వీకే సినిమా నిర్మాత, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ సభ్యులకు నియామక పత్రాలు అందించారు. అనంతరం 500 మంది పేద కళాకారులకు బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి అందాలకు నిలయమైన విశాఖ నగరంలో చలనచిత్రాలు నిర్మించేందుకు ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఫిల్మ్ ఇండస్ట్రీ విశాఖ తరలి రావడానికి పలు సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షులు రాజా, రామారావు, రమేష్, నాగేంద్రమ్మ, నిర్మల భాను, విజయ రమణి, శివ, మేరీ, సూర్య, ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు రాధ, ఏపీ టెక్ మెంబర్ సుశీల పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

సీతమ్మధార: నగరంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లను పోలీసులు హెచ్చరించారు. ఆదివారం ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ ధరేంద్ర.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీనివాసరావు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజు రాత్రి 9 గంటలకు ఇంటి వద్ద ఉండాలని, మద్యం తాగి గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఎవరు, ఎక్కడ ఏయే పనులు చేస్తున్నారో వివరాలు తెలియపరచాలని సూచించారు. ఎటువంటి నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలన్నారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులకు పోలీస్ సిబ్బంది అప్పగించారు.

'ఉక్కు' ఉద్యమం ఆగదు

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకుని ఆ అంశానికి స్వస్తి పలికే వరకు కార్మికులు చేస్తున్న ఉద్యమాలు ఆగవని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఆదివారం నాటికి 913వ రోజుకు చేరుకున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో హెచ్‌ఎంఎస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్మికులు కూర్చొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎన్నో ఏళ్లుగా ఇక్కడ కార్మిక వర్గం ఎంతగానో శ్రమించిందన్నారు. ఇలాంటి పరిశ్రమను అమ్మాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమని, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ ప్లాంట్‌ను నష్టాల ఊబిలోకి నెట్టే ప్రయత్నం చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM

O.S. No. 300 /2023

Between:

Chikkala Appa Rao others ...Plaintiffs

And

(1) Nagalla Venkata Ramakrishna Suryachandra Rao

(2) Nagalla Vijaya Bharathi ...Defendants

NOTICE

To,

(1) **Nagalla Venkata Ramakrishna Suryachandra Rao** S/o. Nagalla Venkata Suryanarayana Murthy

(2) **Nagalla Vijaya Bharathi** W/o Nagalla Venkata Ramakrishna Suryachandra Rao

R/o. Plot No.58, MIG-1, Muvvalavanipalem, Sector-1, Visakhapatnam -17.

Please take notice that the above named plaintiffs filed the suit against you in **OS 300/2023** and the matter stands posted to **05.09.2023.** on that day you are personally or through an advocate attend before the Honourable court at **10:30AM** failing which the matter will be decided exparte in your absence.

M. Rama Manohari, Advocate
Adarshnagar, Visakhapatnam